క్లుప్తంగా

నేడు యథావిధిగా 'స్పందన'


కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884– 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. అలాగే 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

పద్మశాలి సంఘ సమన్వయకర్తగా 'పొన్నగంటి'


పొన్నగంటి సత్యనారాయణ

కాకినాడ: కోస్తా ఆంధ్ర పద్మశాలి సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమన్వయకర్తగా పొన్నగంటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కోస్తా ఆంధ్ర పద్మశాలి సంఘ అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పొన్నగంటి సత్యనారాయణ అఖిల భారత పద్మశాలి సంఘ కార్యదర్శిగా, అఖిల భారత పద్మశాలి తిరుపతి అన్నసత్రం ధర్మకర్తగా, రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా, కాకినాడ పద్మశాలి సంఘ అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు.

జిల్లా దేవదాయ శాఖ అధికారికి పదోన్నతి


పులి నారాయణమూర్తి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణమూర్తికి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. గ్రేడ్–1 ఈఓగా ఆయన పెద్దాపురం మండలం తొలి తిరుపతిలోని శృంగార వల్లభస్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన్ని పిఠాపురంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా నియమించారు. పదోన్నతి పొందిన నారాయణమూర్తిని దేవదాయ శాఖ డీసీ విజయరాజు అభినందించారు.

వేళంగిలో ఉచిత వైద్యశిబిరం


వేళంగి వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు జ్యోతిర్మయి

కరప: వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోమ్‌లో ఆదివారం లయన్స్ డాక్టర్ బొండా వెంకన్నారావు ఆధ్వర్యంలో వేళంగి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి 250 మంది రోగులు రాగా, కాకినాడలోని కేపిటల్ హాస్పిటల్ డాక్టర్ సలాది సత్యసందీప్, గైనకాలజిస్ట్ సలాది జ్యోతిర్మయి వైద్య పరీక్షలు చేశారు. సెల్‌డమ్ ఫార్మా కంపెనీ అధినేత మూర్తి సమకూర్చిన మందులను రోగులకు అందజేశారు. వేళంగి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మెర్ల రాజేంద్ర, కార్యదర్శి ఇళ్ల ఆదేశ్, కోశాధికారి చుండ్రు శ్రీధర్, సభ్యులు బొడ్డు భాస్కరరామన్, చుండ్రు వెంకన్నారావు, సుంకర చంటి, కుంచే సాంబమూర్తి, శాఖా శ్రీనివాస్, కర్నీడి శివ పాల్గొన్నారు.

గొర్రిపూడిలో పల్లెకు పోదాం

కరప: ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ప్రతినిధులు రావూరి సుధ, రంబాల వెంకటేశ్వరరావు కోరారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం గొర్రిపూడిలో వారు స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించి కరపత్రాలు అందజేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, నాయకులు వరాల బాబు, పితాని లీల, కొండలరావు, ఎ.వెంకటేష్, వై.పద్మావతి పాల్గొన్నారు.

నేడు 'ఉన్నత విద్యలో సంస్కరణలు'పై సదస్సు

బాలాజీచెరువు: ఉన్నత విద్యలో సంస్కరణలు–యువత సాధికారితపై స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం సదస్సు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహనరావు, జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు హాజరై సాంకేతికతలో భవిష్యత్తు నైపుణ్యాల కోసం సిద్ధం చేయడం వంటి అంశాలపై వివరిస్తారు. దీనిని ఉన్నత విద్యామండలి క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీవీఎల్ నాయుడు ఆదివారం తెలిపారు.

వందనం.. అభివందనం

- ప్రజా సేవలో మమేకమైన వలంటీర్లు
- నగరంలో 2,300 మంది సేవలు

బోట్‌క్లబ్: వారు సేవకు ప్రతిరూపాలు.. ప్రతి ఇంటికీ సంక్షేమ సారథులు.. ప్రభుత్వానికి ప్రజలకు వారధులు.. ప్రతి పథకం అర్హులకు అందేలా చూస్తున్న సేవకులు. వారే వలంటీర్లు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన ఈ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమైంది. గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, సంక్షేమం ప్రతి ముంగిటకు చేరుతోంది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. చరిత్రలో చెరగని ముద్ర వేసింది. సీఎం జగన్ మానసపుత్రికగా మారిన వలంటీర్ వ్యవస్థ ప్రజా సేవలో పునీతమవుతోంది. నిత్యం ప్రజలతో మమేకమవుతూ సేవలు అందిస్తున్నారు. కాకినాడ నగరంలో 101 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,300 మంది వలంటీర్లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాలు అర్హులకు సక్రమంగా అందించేందుకు వలంటీర్లు అలుపెరుగని సేవలు అందిస్తున్నారు. వార్డు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు సీఎం జగన్ లక్ష్యం మేరకు పని చేస్తున్నారు.

ఇంటి వద్దకే పింఛన్

వృద్ధులు, వికలాంగులు గత ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియక లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి పరిస్థితి వచ్చేది. వారు వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు. వారికి వచ్చే పింఛన్ డబ్బులు కొంత ఆటోలకు వెచ్చించాల్సి వచ్చేది. ప్రస్తుతం వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే పొద్దు పొడవక ముందే ఇంటి తలుపు తట్టి మరీ తమకు పింఛన్ సొమ్ము అందిస్తున్నారని లబ్ధిదారులు ఆనందంగా చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులకు చేరేలా సహకారం అందిస్తున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు వెలకట్టలేనివి. ఈ వైరస్ సోకితే అయినవారే పట్టించుకోని పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు మహోన్నతం. బాధితులకు కావాల్సిన ఆహారం, మందులు సకాలంలో అందించి వారు కోలుకునే వరకూ బాధ్యత తీసుకున్నారు. అప్పట్లో వారి సేవలను అంతా కొనియాడారు.


ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్

తెలవారక ముందే పింఛన్



మా వలంటీర్ తుట్టా దేవి నాలుగేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామునే ఇంటికి వచ్చి మరీ పింఛన్ అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ చేతికి అందాలంటే వారం రోజులు తిరగాల్సి వచ్చేది. గంటల కొద్దీ క్యూలో ఉంటేనే గాని పింఛన్ అందుతుందో లేదో తెలిసేది కాదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో మాకు పింఛన్ సకాలంలో అందుతుంది.

– లోకనాథం శివ, దివ్యాంగుడు, 5వ డివిజన్

సేవలు మరువలేనివి



మా వలంటీర్ కమలా తరచూ వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటోంది. నాకు చేయూత పథకం ద్వారా లబ్ధి వచ్చేలా చేయడంతో ప్రతి ఏడాది రూ. 18,500 పొందుతున్నాను. మాకు రేషన్‌కార్డు లేదు. గతంలో ఎన్నోసార్లు దరఖాస్తులు పెట్టుకున్నా. వలంటీర్ ద్వారా మాకు రేషన్‌కార్డు వచ్చింది. మా కోడలికి విద్యాదీవెన పథకం వచ్చిందంటే అది కేవలం వలంటీర్ వల్లే.

– మట్టపర్తి కుమారి, 49వ డివిజన్, విద్యుత్‌నగర్

ఆధ్యాత్మికం.. ఆనంద పరవశం

- మాఘ మాస సందడి ఆరంభం
- భావనారాయణ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సర్పవరం భావనారాయణ స్వామిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు.
రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి

కాకినాడ రూరల్: పురాతన ప్రసిద్ధ క్షేత్రం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో మాఘ మాస ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ఆలయంలో స్వామివారి దర్శనాలతో పాటు పాలు పొంగించి నైవేద్యంగా సూర్యభగవానునికి సమర్పిస్తుంటారు. తొలి ఆదివారం ఆలయం వద్ద తిరునాళ్లు ఘనంగా జరిగాయి. ఆలయం ఎదురుగా నారద గండం వద్ద పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో పాలు పొంగించి సూర్య నమస్కారాలు, నైవేద్యం సమర్పణ అనంతరం దర్శనాలు చేసుకున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సభ్యులు, ఈఓ భీమశేఖరరావు, గ్రామస్తుడు పుల్ల చందు తదితరులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు 25 వేల మంది భక్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. రెండు, మూడు ఆదివారాలు ఎక్కువగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చైర్మన్ నారాయణరావు తెలిపారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులందరికీ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

రేపటి నుంచి బాబా మందిర వార్షికోత్సవ పూజలు

కరప: గురజనాపల్లిలోని షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవాన్ని ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ తెలిపారు. 13న ఉదయం 8 గంటలకు తాత్కాలిక ధుని వెలిగించి, 9 గంటలకు పల్లకిసేవ నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం 8 గంటలకు అర్చకులు వెలవలపల్లి కామేశ్వరశర్మ, వాసవీ అచ్యుతరామశాస్త్రి ఆధ్వర్యంలో కలశపూజ తదితర పూజాదికాలు ఉంటాయన్నారు. 15న బాబావారి ఉత్సవమూర్తికి విబూది అభిషేకం, 16న దత్తాత్రేయ స్వామికి తులసీదళాలతో అర్చన, 17న ఉదయం 6 గంటల నుంచి బాబావారి ధ్యాన మందిరంలో కొవ్వాడ షిర్డీ సాయిబాబా మందిరం వ్యవస్థాపకుడు, పారాయణ గురువులు దివంగత తిరుమలశెట్టి వెంకటసుబ్బారావు శిష్య బృందంతో 545వ శ్రీసాయి సచ్చరిత్ర ఏకాహ పారాయణ నిర్వహిస్తామన్నారు.


గురజనాపల్లిలో షిర్డీ సాయిబాబా

ఘనంగా బల్లల పండుగ

కరప: స్థానికంగా బల్లల పండుగను రజకులు ఘనంగా జరుపుకొన్నారు. శివగంగ రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కొత్తపేట, పల్లపువీధి, రామకంచిరాజునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లోని రజకులు తీన్‌మార్ వాయిద్యాలతో తమ కుల దేవత ఈదమ్మతల్లిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక సిపాయి చెరువు వద్ద చాకిరేవులోని బల్లల వద్ద ఈదమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్ పూజలు చేశారు. శివగంగ రజక సంఘ గౌరవాధ్యక్షుడు సైనవరపు సత్యనారాయణ, అధ్యక్షుడు మురమల్ల నాగేశ్వరరావు, కార్యదర్శి సైనవరపు సతీష్, కోశాధికారి మంచాల శ్రీనివాస్, నాయకులు కాకినాడ ఈశ్వరరావు, ఓదూరి వెంకటరమణ, ఎం.అప్పారావు పాల్గొన్నారు. గ్రామంలో రజకులు వినియోగించే చెరువును సామూహిక మంచినీటి పథకానికి తీసుకున్నారని, దానికి బదులుగా సిపాయి చెరువు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ సర్పంచ్ ఆశాజ్యోతికి శివగంగ రజక సంఘం ప్రతినిధులు వినతిపత్రం ఇచ్చారు.


కరపలో ఈదమ్మ తల్లికి పూజలు చేస్తున్న రజకులు

పారిశ్రామిక సమ్మె జయప్రదానికి పిలుపు


బంద్ విజయవంతం చేయాలంటూ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న తాటిపాక మధు


కాకినాడ సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం ఈ ర్యాలీని కాకినాడలో ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలోని 14 మండలాల్లో 100 గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ జరిగే ప్రచారాన్ని శాంతినగర్ నుంచి సైకిల్ ర్యాలీగా ప్రారంభించామన్నారు. ఈ ర్యాలీకి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపద, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీ తదితర సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పుతున్నారని విమర్శించారు. విభజన హామీలను అమలు చేయలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, ప్రాజెక్టు నిర్మాణ నిధులు కేటాయించడం లేదన్నారు. ఏఐటీయూసీ నాయకులు అన్నవరం రామయ్య, శ్రీనివాసరావు, అప్పలరాజు, రమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం


కొత్తూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


కాకినాడ రూరల్: రమణయ్యపేట కొత్తూరు వద్ద ఏడీబీ రోడ్డును ఆనుకుని రూ.30 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణయ్యపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యువత కోసం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మండల ఇంజినీర్ వాసుదేవరావు, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఇతర అధికారులకు నిర్మాణ పనుల్లో పలు సూచనలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, నాయకులు గంజా సత్తిబాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకే రమణ, గోపుశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కదలిరావాలి


ఐక్యత చాటుతున్న నాయకులు

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు రెల్లి, మాదిగలతో పాటు అనుబంధ సంఘాలన్నీ ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గాంధీభవన్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. సంజయ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ తీర్పు అనుకూలంగా రాబోతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దళాయి శ్రీకాంత్, బండి యాదగిరి ఆధ్వర్యంలో అనేక మంది సాధన సమితిలో చేరారన్నారు. పెద్ద సంఖ్యలో రెల్లి యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న జేడీ పవన్ తదితరులు

కాకినాడ సిటీ: స్థానిక 43వ వార్డులోని తోట నరసింహం ఉద్యానంలో మాజీ కార్పొరేటర్ జేడీ పవన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ పి.చంద్రకుమారి జయంతిని పురస్కరించుకుని వారి సోదరుడు పి.రాంజీ వంద మొక్కలను బహూకరించారు. వీటిని జేడీ పవన్ నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంటాలన్నారు. కార్యక్రమంలో జానకీరామ అసోసియేషన్, ట్రెజరీ కాలనీ వాసులు, వార్డులోని పెద్దలు చెల్లిపోయిన రామకృష్ణ, మారయ్య, కంభం గణేష్, గోవిందరాజులు, రంగనాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

బాలాజీచెరువు: స్థానిక ఆర్ఎంసీ క్రీడా మైదానంలో యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. క్రికెట్, చెస్, షటిల్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించగా ఏడు జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను యూనియన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ జీఎస్‌వీ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


రమణయ్యపేటలో ఇంటింటికీ కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూ.6 కోట్లతో ఓహెచ్ఆర్ ట్యాంక్‌లు, కుళాయిలు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రమణయ్యపేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట గ్రామ పరిధిలో రాయుడుపాలెం, ఆంజనేయనగర్, బాపన్నదొర కాలనీల్లో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులను ఆదివారం ఆయన ప్రారంభించి, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. అలాగే ఏపీఐఐసీ కాలనీ, జనచైతన్య లేఅవుట్, ఎఫ్‌సీఐ కాలనీలో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రమణయ్యపేటలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లామన్నారు. దీంతో ఈ గ్రామంలో రూ.6 కోట్లతో తాగునీటి సరఫరాకు పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే రూ.4.5 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. మరో రూ.1.5 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఇంటింటికీ కుళాయిలు ఇస్తున్నామని, అదనంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌లు తీసుకువచ్చామని, పైప్‌లైన్లు వేశామన్నారు. కొత్త కాలనీలు, కొత్త ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో లేని విధంగా పెద్ద ఎత్తున తాగునీటి సరఫరా చేస్తున్నామన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం రూ.110 కోట్లతో తాగునీటి పథకాలు తీసుకువచ్చామన్నారు. ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, వచ్చే వేసవికి పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు, తనకు ప్రజలు మద్దతు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, రాయుడు నాగేశ్వరరావు, మోకా కృష్ణంరాజు, తర్లంపూడి నాని, మాసవరపు సత్యనారాయణ, రేఖా రెడ్డి, ధర్మరాజు, రామిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు చేరువ చేసేందుకే వికసిత్ భారత్


వికసిత్ భారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరువ చేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. స్థానిక రాగంపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేసి పథకాలపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కేంద్ర పథకాలకు సంబంధించిన క్యాలెండర్‌ను కమిషనర్, బీజేపీ నేతలు ఆవిష్కరించారు. ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో నిలవాలనే ప్రధాని మోదీ లక్ష్య సాధనలో అన్నివర్గాలూ భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. బీజేపీ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్, నాయకులు గట్టి సత్యనారాయణ, వేటుకూరి సూర్యనారాయణరాజు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు హాజరయ్యారు.

వయో వృద్ధులకు భరోసా ఇవ్వండి


సమావేశంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ: వయో వృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.నారాయణమూర్తి, కె.రామచంద్రరావు కోరారు. ఆదివారం స్థానిక సూపర్‌బజార్ కార్యాలయ ఆవరణలో ఏపీ స్టేట్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ, లేదా ప్రత్యేక కమిషనరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్లు పైబడిన అర్హులకు రూ.6,500 వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడంతోపాటు ఆర్టీసీలో 50 శాతం రాయితీ అమలు చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడిగా బల్లమూడి సూర్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఆర్ఎస్ సుధాకరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వి.రామసుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా జేఎస్‌వీ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మండవిల్లి భాస్కరరావు, కార్యదర్శులుగా వి.శివాజీగణేష్, జీవీఎస్‌వీవీ సత్యనారాయణమూర్తిలను నియమించారు. రాష్ట్ర కోశాధికారి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు కొండానిర్మల పాల్గొన్నారు.

ఘంటసాల గీతాలు సజీవం


ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి

బోట్‌క్లబ్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు మన మధ్య లేకున్నా ఆయన గీతాలు సజీవంగానే ఉన్నాయని మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి అన్నారు. స్థానిక గాంధీనగర్ పార్కులో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుండోజు అరుణాకరరావు, మేడిశెట్టి శ్రీరాములు, కోడిగుడ్డు సత్యం, సీహెచ్ వెంకటరమణ మూర్తి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత విభావరి జరిగింది. గాయకులు ఘంటసాల పాటలను మధురంగా ఆలపించారు. అనంతరం నిర్వాహకులను 41వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోడి వెంకట్ ఆధ్వర్యంలో సత్కరించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బీరులో సిరా కలిపిన వ్యక్తిపై కేసు

కాకినాడ క్రైం: బీరులో సిరా కలిపి కల్తీకి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఆ వివరాల్లోకి వెళితే.. స్థానిక జగన్నాథపురం ఏటిమొగకు చెందిన పట్టా వెంకటేశ్వర్లు ఈ నెల 5న తన కుమారుడి ద్వారా జె.రామారావుపేటలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ కంపెనీకి చెందిన రెండు బీరు సీసాలు కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకొచ్చి ఓ సీసాలో మద్యం తాగాడు. మరో బాటిల్ కూడా తాగేందుకు సిద్ధమయ్యే సరికి అందులో నీలిరంగు ద్రవం ఉందని, అదేరోజు రాత్రి 9.50 గంటల సమయంలో మద్యం దుకాణానికి వెళ్లి గొడవ పెట్టుకున్నాడు. తిరిగి 6వ తేదీ ఉదయం మరోమారు వచ్చి తీవ్ర దూషణతో హల్‌చల్ చేశాడు. ప్రభుత్వం, అధికారులపై ఆరోపణలు చేశాడు. దీంతో ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. తక్షణమే అక్కడికి చేరుకున్న అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ ఆఫీసర్ కృష్ణవేణి బృందం ఆరోపిస్తున్న వ్యక్తి వద్ద ఉన్న బాటిల్‌లోని మద్యం నమూనాలు సేకరించింది. అలాగే, అదే బ్యాచ్‌కు చెందిన కొన్ని వందల సీసాలలో నమూనాలను సైతం సేకరించారు. వీటిని గుంటూరులోని ప్రభుత్వ రీజినల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ల్యాబొరేటరీకి పరీక్షల నిమిత్తం పంపినట్లు డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జయరాజు, సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తెలిపారు. ఆ నివేదిక శనివారం రాత్రి అందడంతో వెంకటేశ్వర్లు కుటిల యత్నం బయట పడిందన్నారు. కొన్న బాటిళ్లలో ఎటువంటి కల్తీ జరగలేదని, ఇంటికి తీసుకువెళ్లి సిరా కలిపి ఆ బాటిల్ తీసుకువచ్చి హల్‌చల్ చేశాడని స్పష్టమైందని వివరించారు. దీంతో ఎక్సైజ్ అధికారులు కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, యంత్రాంగం, శాఖపై తప్పుడు ఆరోపణలు చేసిన వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.సురేష్‌బాబు చెప్పారు. ఈ నేరంలో అతడితో పాటు మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తీరంలో పర్యాటకుల సందడి


పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగరతీరం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఉప్పాడ నుంచి కాకినాడ వరకూ ఉన్న తీరప్రాంతంలో పర్యాటలకులు సందడి చేశారు. సెలవు రోజు కావడంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా బీచ్‌కు వచ్చారు. యువత కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. ఆటపాటలతో సందడి చేశారు. తీర ప్రాంతం వెంబడి నిలువ నీడ లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. తీరంలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.